ప్రజాశక్తి
మంగళవారం 19 ఆగస్టు 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

పైర్ల మనుగడ ప్రశ్నార్థకం

- కృష్ణా తీరాన్ని వెంటాడుతున్న ముంపు
- సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజి వరకు పెరిగిన వరద

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కృష్ణా తీరాన్ని ఈ ఏడాది ముంపు సమస్య వెంటాడుతోంది. ఈ ఏడాది సాగు చేసిన విస్తీర్ణమే తక్కువ కాగా సాగు చేసిన పైర్లు ఏమేరకు నిలదొక్కుకుంటాయన్నదీ ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే డెల్టా పరిధిలో 70 వేల ఎకరాల్లో వరి పైరు దెబ్బతింది. ఇంత వరకు ప్రభుత్వం ఈ అంశంపై ఎటువంటి నష్టపరిహారం ప్రకటన చేయలేదు. కొన్ని పంటలు తిరిగి నిలదొక్కుకోగా సోమవారం సాయంత్రం నుంచి తీర ప్రాంతంలోని గ్రామాలకు మళ్లీ ముంపు సమస్య ఏర్పడింది. శ్రీశైలం నుంచి విడుదల చేసిన నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. దీంతో నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజికి వరద నీరు భారీగా వస్తోంది. మరోవైపు జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో బుధవారం వరకు భారీ వర్షాలు కొనసాగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

శ్రీశైలం నుంచి 4.03 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల కాగా సాగర్‌కు 3.05 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరింది. సాగర్ నుంచి 2.67 లక్షల క్యూసెక్కులు విడుదల చేయగా పులిచింతలకు 2.94 లక్షల క్యూసెక్కులు చేరుతోంది. పులిచింతల నుంచి దిగువకు 3.65 లక్షల క్యూసెక్కుల ప్రవాహం విడుదల చేయడంతో మంగళవారం ఉదయం ప్రకాశం బ్యారేజికి వరద ప్రవాహం మరింత పెరగనుంది. ప్రకాశం బ్యారేజి కి పులిచింతల నుంచే కాక ఖమ్మం,కృష్ణా జిల్లాల నుంచి వచ్చే ప్రవాహంతో మరింత పెరగనుంది. మొత్తంగా రాగల 24 గంటల్లో పులిచింతల ఎగువ,

2లో



ఇటీవల వానలకు తాడేపల్లి మండలం కుంచనపల్లిలో నీట మునిగిన ఆకుకూర పంటలు



ఇటీవల వానలకు తెనాలి ప్రాంతంలో నీట మునిగిన పొలాలు



మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

బార్‌ల దరఖాస్తులకు భారీగా ఫీజులు

- ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు తప్పనిసరి
- గుంటూరు 110, పల్నాడుకు 49 అనుమతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

మద్యం విక్రయాలకు బార్‌ల లైసెన్సుల మంజూరుకు దరఖాస్తులకు రూ.5 లక్షలు ఫీజులు నిర్ధారిస్తూ ప్రభుత్వం బార్ పాలసీ 2025-2028 రూపొందించింది. గుంటూరు జిల్లాలో 110, పల్నాడు జిల్లాలో 49 బార్లకు అనుమతించారు. వీటిల్లో 10 శాతం గీత కులాలకు కేటాయిస్తారు. మూడేళ్ల పాటు కొనసాగే లైసెన్సులకు కూడా ఫీజులు భారీగా పెంచారు. 50 వేల లోపు జనాభాకు రూ. 35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షలు దాటిన నగరాల్లో రూ.75 లక్షలు లైసెన్సు ఫీజుగా చెల్లించాలి. ప్రతి ఏటా 10 శాతం అదనపు ఫీజుతో లైసెన్సులను రెన్యూవల్ చేయించుకోవాలి. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో 10 కిలో మీటర్ల విస్తీర్ణంలో 73 బార్లను కేటాయించారు. మునిపాలిటీ పరిధిలో మూడు కిలో మీటర్ల పరిధిలో నిర్దేశిత ఫీజులు

2లో

దుగ్గిరాల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



5లో

పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.10 వేలు సాయం చేయాలి

తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలో రైతు, కౌలు రైతు, వ్యవసాయకార్మిక సంఘాలు డిమాండ్ - అధికారులకు వినతి పత్రాలు

నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుండి విడుదలవుతున్న నీరు



జలాశయాలకు ఉధృతంగా వరదనీరు

ప్రజాశక్తి - విజయపురిసౌత్, తాడేపల్లి

సాగర్ 26 గేట్లు, ప్రకాశం బ్యారేజీ 70 గేట్ల ద్వారా నీటి విడుదల

కృష్ణానది పరివాహక ప్రాంతాలలో ఎడతెరిపి లేని వానల కారణంగా ఎగువ జలాశయాల నుండి నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు నీటి ఉధృతి కొనసాగుతోంది. సోమవారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయం 9 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,31,699 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేస్తుండగా సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 8 గేట్లను 10 అడుగులు వరకు, 18 గేట్లను 5 అడుగుల వరకు ఎత్తి 2,51,182 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనుండి వరద ప్రవాహం పెరగటంతో 26 గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 585.80 అడుగులవద్ద ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 299.7430 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,826 క్యూసెక్కులను, కుడి కాల్వ ద్వారా 6006 క్యూసెక్కులను, ఎడమ కాల్వ ద్వారా 4949 క్యూసెక్కులను, ఎస్ఎల్‌బిసి ద్వారా 2400 క్యూసెక్కులను, లోలెవల్ కెనాల్ ద్వారా 300 క్యూసెక్కులను మొత్తంగా 2,93,663 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పరిశీలించారు. పరిస్థితిని మాచర్ల ఈఈ సి.రమేష్ వివరించారు. ప్రాజెక్టులో మరో 13 టీఎంసీల నీరు నిల్వ చేయొచ్చని చెప్పారు. మరోవైపు ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతుండడంతో బ్యారేజీకున్న 70 గేట్లు ఎత్తి

2లో



ప్రకాశం బ్యారేజీ నుండి సముద్రంలోకి విడుదలవుతున్న నీరు

చలో కరేడును అడ్డుకోవడం అప్రజాస్వామికం : సిపిఎం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల సంయుక్త పిలుపు మేరకు సోమవారం తలపెట్టిన సభను అడ్డుకోవడం, చలో కరేడు కార్యక్రమానికి అనుమతి లేదంటూ అడ్డుకోవడం అప్రజాస్వామికమని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. రైతుల భూములను కూటమి ప్రభుత్వం బలవంతంగా గుంజుకుంటుందనే విషయం అక్రమ అరెస్టులతో తేలిందని, కరేడు గ్రామాన్ని పోలీసులు తమ గుప్పెట్లోకి తీసుకుని బయట వ్యక్తులు రాకుండా అన్ని మార్గాలను మూసి వేయడం, వాహనాలను తనిఖీ, గ్రామ సచివాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద మఫ్టీలో పోలీసుల నిఘా వంటివి ప్రజా స్వేచ్ఛను హరించడమేనని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజా సంఘాలు తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పుకోనీయకుండా నిరంకుశ పోకడలకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం సరికాదని పేర్కొన్నారు. కరేడు రైతుల అభిప్రాయాలను గౌరవించాలని, భూములను బలవంతంగా సేకరించాలానే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని కోరారు. బలవంతపు భూసేకరణపై ముందుకెళ్తే కరేడు రైతులకు అండగా రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఏకం చేసి పోరాడతామని హెచ్చరించారు.

పైర్ల మనుగడ ప్రశ్నార్థకం

(మొదటి పేజీ తరువాయి)

దిగువన పలుగ్రామాలకు ముంపు సమస్య ఏర్పడనుంది. దాచేపల్లి నుంచి రేపల్లె వరకు కృష్ణా పరివాహక ప్రాంతంల్లో పొలాలకు ముంపు సమస్య ఏర్పడనుంది. ప్రధానంగా అమరావతి, తుళ్లూరు, తాడేపల్లి, తెనాలి, కొల్లిపర మండలాల్లో పంటలకు నష్టం మరింత పెరగవచ్చు.

ఈనెల 12, 13 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షం వల్ల జిల్లాలోని దాదాపు లక్ష ఎకరాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యారు. ఇందులో 70 వేల ఎకరాల్లో వెదపద్ధతిలో సాగు చేసిన భూముల్లో వరి పైరుకు నష్టం జరిగింది. వరితో పాటు కూరగాయలు, ఆకుకూరల తోటలు దెబ్బతిన్నాయి. పసుపు, కంద పంటలు నీట మునిగాయి. గుంటూరు ఛానల్‌కు గండ్లు పడటం, కొండవీటి వాగు ముంపు వల్ల నష్టం పెరిగింది. గత వారం కురిసిన వర్షాలతో పాటు పలు వాగుల వల్ల వచ్చిన నీరు ఇప్పటికీ పొలాల్లో కొనసాగుతుండగా తాజాగా కురుస్తున్న వర్షాలు, తాజాగా వస్తున్న వరదతో ముంపు సమస్య మరింత పెరిగి రైతులకు నష్టం తీవ్రత పెరగనుంది. వర్షాలు, వరదల వల్ల పలు గ్రామాల్లో రహదారులు బాగా దెబ్బతిన్నాయి. వరితోపాటు పత్తి, మిర్చి సాగుజరిగిన ప్రాంతాల్లో అధిక వర్షాలు, ముంపు వల్ల పైర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

బార్‌ల దరఖాస్తులకు భారీగా ఫీజులు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్‌లో 17, తెనాలిలో 17, పొన్నూరులో 3 బార్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చామని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు తెలిపారు. ప్రతి దరఖాస్తు దారుడు రూ.5 లక్షలు ఫీజు, రూ.10 వేలు అదనంగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులకు తక్కువ కాకుండా వస్తేనే లాటరీ తీస్తామని లేదంటే సంబంధిత బార్ లైసెన్సు మంజూరును పెండింగ్‌లో ఉంచుతామన్నారు. ఈనెల 26వ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 28న గుంటూరు,నరసరావుపేట కలెక్టరేట్‌లలో లాటరీ ద్వారా బార్ల కేటాయింపు చేస్తామన్నారు. గుంటూరు కార్పొరేషన్‌లో గౌడ్ కులస్తులకు 3 బార్లు, గౌడ కులం వారికి 4 కేటాయించగా తెనాలిలో ఒకటి కేటాయించామన్నారు. వీరికి లైసెన్సు ఫీజులో 50 శాతం రాయితీ ఉందన్నారు.

పల్నాడు జిల్లాలో నరసరావుపేటలో 17, చిలకలూరిపేట 10, సత్తెనపల్లి 4, పిడుగురాళ్ల 6, మాచర్ల 4, వినుకొండ 6, గురజాల 1, దాచేపల్లి 1 బార్‌కు అనుమతి ఇచ్చామన్నారు. నరసరావుపేటలో గౌడ్ కులస్తులకు ఒకటి, చిలకలూరిపేటలో గౌడ కులస్తులకు ఒక్కటి, సత్తెనపల్లిలో గౌడ్ కులస్తులకు ఒక్కటి, దాచేపల్లిలో గౌడకు ఒక్కటి, మాచర్లలో గౌడ్‌కు ఒక్క బార్ కేటాయించినట్టు తెలిపారు. వచ్చేనెల ఒకటి నుంచి 2028 ఆగస్టు 31 వరకు మూడేళ్ల పాటు లైసెన్సు కొనసాగుతుందన్నారు. ప్రతి ఏటా లైసెన్సు ఫీజు 10 శాతం పెంచి చెల్లించాలన్నారు. మొత్తం ఫీజు ప్రతి ఏటా ఆరు వాయిదాల్లో చెల్లించాలన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్ లైను, హైబ్రీడ్ పద్ధతిలోనే సమర్పించవచ్చునని తెలిపారు. బార్ ఎక్కడ ఏర్పాటు చేసుకునేది ముందుగానే తగిన చిరునామాతో తెలియజేయాలన్నారు. దరఖాస్తు ఫీజు తిరిగి ఇవ్వబోమన్నారు. బార్ల సమయం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఉంటుందని చెప్పారు.

జలాశయాలకు ఉధృతంగా వరదనీరు

(మొదటి పేజీ తరువాయి)



దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ వద్దకు 2.84 లక్షల క్యూసెక్కులు వస్తుండగా అదే స్థాయిలో దిగువకు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. సోమవారం కూడా వర్షాలు పడటంతో మంగళవారం నాటికి 3.97 లక్షల క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజీ వద్దకు వచ్చే అవకాశం ఉందని, 20వ తేదీ నాటికి 7 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో నదిలోకి చేపల వేటకు వెళ్లొద్దని, నదీపరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

యాప్‌లతో ఒత్తిడికి గురవుతున్న ఎఎన్‌ఎంలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్

ప్రజాశక్తి - మంగళగిరి

అనేక యాప్‌లతో ఎఎన్‌ఎంలు ఒత్తిడికి గురవుతున్నారని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ అన్నారు. యూనియన్ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు జయరాజు అధ్యక్షత వహించగా శ్యామ్ మాట్లాడుతూ సర్వేల ద్వారా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జ్వరాలు, అంటూ వ్యాధులు, మాతా సిస్ సంరక్షణ సేవలు ఆటంకం ఏర్పడడానికి అవకాశం ఉందని అన్నారు. హెల్త్ సెక్రటరీలను మినహాయించి ఆరోగ్య సేవలకు భంగం వాటిల్లకుండా, ఆరోగ్య సేవలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అన్నమ్మ మాట్లాడుతూ సచివాలయం హెల్త్ సెక్రటరీలకు ఎఎన్‌ఎంగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ, వివిధ పిహెచ్‌సి, యుబిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళులు

ప్రజాశక్తి - మంగళగిరి

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతిని స్థానిక పాత మంగళగిరి గౌడ కమ్యూనిటీ హాల్‌లో గౌడ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వాకా మాధవరావు గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. చిత్రపటానికి రాష్ట్ర కల్లు గీత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయ ప్రకాష్ నారాయణ, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు వాకా రాంగోపాల్ గౌడ్, రాష్ట్ర గౌడ సంఘం మహిళా అధ్యక్షులు రాజులపాటి కళ్యాణి, తెలుగు నాడు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రేఖా సుధాకర్ గౌడ్ పూలమాలలేసి నివాళులర్పించారు. తాతా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ గోల్కొండ ఖిల్లా జయించిన మహారాజ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, గోల్కొండ నవాబుల హింసాత్మక చర్యల నుండి ప్రజలను కాపాడారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ పి.శ్రీనివాస్, తాతారావు, వి.వెంకటాచలం, శివప్రసాద్, టి.కోటయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

శతాధిక కవి సమ్మేళనంలో ఆళ్ళకు సన్మానం

ప్రజాశక్తి తెనాలి : నూతన సాహితీ సంస్థ, విశ్వ సాహితీ కళావేదిక ఆవిర్భావ సభలో జరిగిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పట్టణానికి చెందిన కవి, రచయిత ఆళ్ళ నాగేశ్వరరావు పాల్గొని, కృత్రిమ కన్నీరు శీర్షికన వచన కవితను గానం చేసి సభికుల ప్రశంసలు అందుకున్నారు. విజయవాడ ఐఎంఏ హాలులో ఆదివారం జరిగిన సాహిత్య సభలో ముఖ్య అతిధి గా విచ్చేసిన ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు గజల్ శ్రీనివాస్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జి.వి పూర్ణచంద్ చేతుల మీదగా ఆళ్ళను సత్కరించారు. కార్యక్రమంలో విశ్వ సాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు కొల్లి రమావతి, రంగిశెట్టి రమేష్, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.



ఆళ్ళను సత్కరిస్తున్న గజల్ శ్రీనివాస్



ఎస్టీ హాస్టల్‌లో కలెక్టర్, ఎస్పీ తనిఖీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం ఎత్తిపోతలలోని ఎస్టీ బాలిక సంక్షేమ హాస్టల్‌ను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివసరావు సోమవారం సందర్శించారు. బాలికల భద్రత అత్యంత ప్రాధాన్యత అంశమని, సిసి కెమెరాలతోపాటు హాస్టల్ నలువైపులా వెలుతురు ఉండేలా చూసుకోవాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలన్నారు. రాత్రివేళల్లో వార్డెన్లు తప్పనిసరిగా హాస్టల్లోనే ఉండాలన్నారు. హాస్టల్‌లో కోతుల బెడదపై విద్యార్థినులు చెప్పగా నివారణ చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మురళీకృష్ణ, తహశీల్దార్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా జిఎంఎస్ గుప్తా

ప్రజాశక్తి - పొన్నూరు



పట్టణంలోని సహస్ర లింగేశ్వర స్వామి, ఆంజనేయస్వామి దేవాలయ కమిటీకి చైర్మన్‌గా జిఎంఎస్ గుప్తా నియమితులయ్యారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడిగానూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆయనకు పదవి దక్కడంపై పలువురు అభినందనలు తెలిపారు.

వైసిపిని వీడి జనసేనలోకి

ప్రజాశక్తి - బెల్లంకొండ : మండల కేంద్రమైన బెల్లంకొండకు చెందిన 20 కుటుంబాలు వైసిపిని వీడి జనసేనలో చేరగా వారిని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు ఆహ్వానించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎర్రంశెట్టి రామకృష్ణ సమక్షంలో స్థానిక జనసేన కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నాయకులు బి.వెంకటరావు, వై.వేణు, ఎన్.బ్రహ్మనాయుడు, సయ్యద్ సైపుల్ల పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

ప్రజాశక్తి - తాడికొండ : రైతుకు న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు అన్నారు.రాజధాని రైతులకు న్యాయం చేయాలని కోరుతూ నిడుముక్కల గ్రామంలో కోటేశ్వరరావు చేస్తున్న దీక్ష సోమవారానికి 50వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూమి తీసుకొని ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని విమర్శించారు. ప్రతి ఒక్క రైతుకు కోటి రూపాయలు 1250 గజాల స్థలాన్ని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. బహుజనులకు రాజ్యాధికారం వచ్చేవరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

మీ జీవితాన్ని నిర్దేశించేది రాబోయే నాలుగేళ్లే

ఎన్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమంలో కోనేరు శ్రీదేవి

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని విశదల అడ్డ రోడ్డు వద్ద గల ఎన్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల ఇండక్షన్ ప్రోగ్రాం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆఫ్ కస్టమర్ సక్సెస్ సేల్స్ ఫోర్స్ వైస్ ప్రెసిడెంట్ కోనేరు శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థిగా మొటమొదటి రోజు కళాశాలలో గడపటం ఎంతో గొప్ప అనుభూతినిస్తుందన్నారు. రాబోయే నాలుగేళ్లను ఎలా ఉపయోగించుకుంటామో అనేదానిపై జీవితం ఆధారపడి ఉంటుందని విద్యార్థులకు ఉద్బోధించారు. డిజిటల్ రంగంలో విప్లవాత్మక మార్పులొస్తున్నాయని, వాటికి తగట్టు పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. పుస్తకాలు చదవడంతో పాటు లైబ్రరీ ఆన్లైన్ సర్వీసెస్ ఉపయోగించి విజ్ఞానాన్ని సంపాదించాలన్నారు. కళాశాల సెక్రటరీ అయిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మనం చేసే పనులు కుటుంబానికి, సమాజానికి ఉపయోగకరంగా ఉండాలన్నారు. జీవితంలో సమస్యలు సహజమని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని జీవితాన్ని సార్ధకతం చేసుకోవాలని చెప్పారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు నెలకోసారైనా కళాశాలను సందర్శించి విద్యార్థుల చదువు గురించి ఆరా తీయాలని సూచించారు. సెల్‌ఫోన్ కంటే ల్యాప్‌ట్యాప్ కొనిపించడం ఉత్తమమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.సంజయ్ మాట్లాడుతూ తమ కళాశాలలో నూతన లేబరేటరీస్‌తో పాటు అత్యుత్తమ బోధనా సిబ్బంది ఉన్నారని, రెండో సంవత్సరం నుండే ప్రత్యేక శిక్షణిచ్చి



మంచి ఉద్యోగాలు సాధించేలా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఏవో సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి, హెచ్‌ఒడి కెఎస్‌ఆర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

20న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ఉద్యోగుల సమస్యలపై

స్పష్టమైన నిర్ణయాలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఈనెల 20న జరిగే రాష్ట్రస్థాయి జాయింట్ స్టాఫ్‌కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగులకు, విశ్రాంతి ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా చైర్మన్ చాంద్‌భాషా ఒక ప్రకటనలో కోరారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాల పట్ల ఉద్యోగులు, పెన్షనర్లు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారని అన్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను పున:ప్రారంభించాలని, వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ.25వేల కోట్ల బకాయిలను చెల్లించటానికి చట్టబద్ధత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను చెల్లించటానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై క్యాబినెట్ సబ్ కమిటీని నియమించి ఆ కమిటీలో ఉద్యోగుల సమస్యలపై చిత్తశుద్ధితో పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

తెనాలి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

ప్రజాశక్తి - తెనాలి

సంఘ కాపరుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తామని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు బిషప్ డాక్టర్ పినపాటి జాన్ పాల్, అధ్యక్షులు పాముల పరంజ్యోతి చెప్పారు. స్థానిక నందుల పేటలో బిషప్ అన్నం ఆదాం అధ్యక్షతన ఆయన ప్రార్ధనా మందిరంలో సోమవారం జరిగిన పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి సమావేశంలో బిషప్ డాక్టర్ పినపాటి జాన్ పాల్, బిషప్ పాముల పరంజ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలపై చర్చించారు. భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. సంఘ సేవకులకు ఎలాంటి సమస్య ఎదురైనా అసోసియేషన్ దష్టికి తేవాలని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి విలియం కేరి, ఉపాధ్యక్షులు బిషప్ గడ్డం సాధుథామస్ జూనియర్, కార్యదర్శి రెవరెండ్ సువర్ణ రాజు, సహాయ కార్యదర్శులు రావూరి విక్టర్ పాల్, మల్లవరపు విజయ్ కుమార్, గడ్డం జాన్ బాబు, రజినీకాంత్, షడ్రక్ పాల్గొన్నారు.

రాజధాని రైతుల ముఖ చిత్రం మారలేదు

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఏమి చేసింది : సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 15 నెలల పాలనలో రాష్ట్రానికి ఏమి చేసిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రశ్నించారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్‌లో (వల్లూరు గంగాధరరావు ప్రాంగణం) లో సిపిఐ జిల్లా 26వ మహాసభలలో భాగంగా రెండోరోజు ప్రతినిధుల సభను నాగేశ్వరరావు ప్రారంభించి ప్రసంగించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలలో ఏ అంశాలకు మద్దతునిచ్చిందో చెప్పాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి ఏమి తోడ్పాటు అందించిందో ప్రజలకు చెప్పాలన్నారు. మహాత్మాగాంధీని దోషిగా చూపి, జవహర్‌లాల్ నెహ్రూను ద్రోహిగా చెప్పి, గాంధీని చంపిన గాడ్సేకు మందిరాలు కట్టించే పార్టీతో మీ స్నేహం ఎంతకాలం కొనసాగిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజకీయ చిత్రపటం మారడానికి అమరావతి రైతాంగ పోరాటం చోదకశక్తిగా పనిచేసిందని, కానీ అమరావతి రైతుల ముఖచిత్రం మాత్రం ఇంకా మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్లాట్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ఇంటి నిర్మాణానికి అవసరమైన పద్ధతిలో ప్లాట్లను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, పారిశ్రామికీకరణకు, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని, అలా కాకుండా గాలిలో మేడలు కడితే నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా, అమరావతి రైతుల సమస్యల పరిష్కారానికి కోసం భవిష్యత్ పోరాటాలకు పునరంకితం అవుతామని అన్నారు. గుంటూరు జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యదర్శి నివేదికను జంగాల ప్రవేశపెట్టారు. చిన్ని తిరుపతయ్య, ఆకిటి అరుణ్ కుమార్, రెంటాల కుమార్, యశ్వంత్ అధ్యక్షతవర్గంగా వ్యవహరించారు. తొలుత సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అమర వీరుల స్థూపానికి ప్రతినిధులు నివాళి అర్పించారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ప్రతినిధులు

బాలికలకు నిత్యవసరాలు పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని డోలాస్ నగర్, గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ కరుణాలయంలో మంగళగిరికి చెందిన అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ సహాయ కార్యదర్శి బూసి గోవిందరాజు, భూలక్ష్మి దంపతుల మనవడు ధనుష్ మొదటి పుట్టినరోజును పురస్కరించుకొని బాలికలకు అన్నదానం, నిత్య అవసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధనుష్‌తో కేక్ కట్ చేయించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుమంచి రామారావు మాట్లాడారు. మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకొని గోవిందరాజు తన మనవడి పుట్టినరోజున అనాథ బాలికలకు అన్నదానం చేసి, నిత్యవసరాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనాథ బాలికలను ఆదుకోవడం సమాజంలో అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో కరుణాలయం సిస్టర్ మెర్సీ, అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ కార్యదర్శి గరికమొక్కు డేవిడ్, ట్రస్ట్ ప్రతినిధులు బీ ప్రభువాణి, చెన్నయ్య, గురవయ్య, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి : అనారోగ్యంతో బాధపడుతున్న వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు సోమవారం పంపిణీ చేశారు. తాడేపల్లి 6 వ వార్డ్ కి చెందిన ఉప్పు లక్ష్మి కి రూ. 75,000వేలు, 15 వ వార్డ్‌కి చెందిన కుండ నాగ సాయి కుసుమ కి రూ.29,544 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అద్దంకి మురళి, పుల్లపు భాస్కరరావు, ఎస్.కె మస్తాన్ వలి, దేవళ్ల ప్రసాద్,తురక దుర్గరావు,తాడి బోయినగోపి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-తెనాలి : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ చట్టాన్ని, తల్లి తండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టంను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్, డిఎస్పీ కార్యాలయం లో సోమవారం వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంటరి వృద్ధులపై వేధింపులు, దోపిడీలు ,హత్యలను అరికట్టాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషను పరిధి లో సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కొరకు సీనియర్ సిటిజన్స్ సంఘ ప్రతినిధులతో స్వచ్ఛంద కమిటీలు ఏర్పాటు చెయాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో సినియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక క్యూ లైన్స్ , ప్రత్యేక బెడ్స్ , ప్రత్యేక వార్డ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు గుమ్మడి నారాయణ రావు , కార్యదర్శి కె నాగేశ్వర రావు , పి రాంబాబు , అర్ భుజంగ రావు, పి మల్లికార్జున రావు , ఎం అర్జున్, వైసిపి బోస్ తదితరులు పాల్గొన్నారు.

వీధికక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

వీధి కుక్కల నియంత్రణకు ఇటీవల సుప్రీమ్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను గుంటూరు నగర పాలకసంస్థ పరిధిలో అమలు చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్ సభ్యులు కోరారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు ఐఎంఎ నాయకులు వినతిపత్రం అందజేశారు. నగరంలో అధికంగా ఉన్న వీధి కుక్కలు విద్యార్థులు, ప్రజలపై దాడి చేసి, గాయపరు స్తున్నాయని, ఎంతో మంది రేబిస్ బారిన పడుతున్నారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి సుప్రీమ్ కోర్టు వీధి కుక్కలకు షెల్టర్ హోమ్‌లు ఏర్పాటు చేసి, అవి రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. సదరు ఆదేశాలను అమలు చేయాలని, కుక్కలకు షెల్టర్ హెూమ్‌లు ఏర్పాటు చేసి, వీధి కుక్కలు రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యుల వినతిపత్రంపై మేయర్, కమిషనర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారాయుడు యార్లగడ్డ, డాక్టర్ రామ్‌తారకనాథ్, డాక్టర్ సతీష్ కుమార్, బి. సుబ్బయ్య, కే. వెంకటకష్ణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ గ్రీవెన్స్‌లో ప్రజల నుండి 33 ఫిర్యాదులు స్వీకరించి, వాటి పరిష్కారానికి ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా కమిషనర్ 16 అర్జీలు స్వీకరించారు.



మేయర్, కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐఎంఎ నాయకులు

శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గోరంట్ల, ఇన్నర్ రింగ్‌రోడ్, రవీంద్ర నగర్ ప్రాంతాల్లో పర్యటించి, మౌలిక వసతుల కల్పన, త్రాగునీటి సరఫరా, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల్లో డ్రైన్లు, రోడ్లు, త్రాగునీటి కుళాయి కనెక్షన్ల వంటి మౌలిక వసతుల కల్పనకు ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. నూతనంగా నిర్మాణం చేసే డ్రైన్లు తప్పనిసరిగా లెవల్స్ ఉండేలా, నాణ్యత పాటించేలా పర్యవేక్షణ చేయాలని, తమ పరిశీలనలో లోపాలు గుర్తిస్తే సంబందిత అధికారులు, కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం కష్ణానదికి వరదనీరు వస్తున్నందున నగరంలో ప్రజలు త్రాగునీటిని కాచి చల్లార్చి త్రాగాలని అన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో శ్యాంపిల్స్ తీయాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. గోరంట్ల, ఇన్నర్ రింగ్‌రోడ్ చుట్టుపక్కల నివాసాలు పెరుగుతున్నందున ఆయాప్రాంతాల్లో ఖాళీస్థలాల్లో నీరునిలిచి దోమలు, పురుగులతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తమ దష్టికి తెస్తున్నారన్నారు. కావున ఖాళీస్థలాల యజమానులు వారి స్థలాలను శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. స్పందించని వాటికి జిఎంసి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పర్యటనలో డిఈఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నార్ల ఆడిటోరియం స్థలాన్ని సర్వే చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

నార్ల ఆడిటోరియం, పరిసర ప్రాంతాల్లో సమగ్ర సర్వేచేసి, ఆక్రమణలు ఉంటే తొలగించుకోవడానికి నోటీసులు ఇవ్వాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక బందావన్‌గార్డెన్స్‌లోని నార్ల ఆడిటోరియంను మేయర్, కమిషనర్, జిఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మేయర్, కమిషనర్‌లు ఆడిటోరియం, పరిసరాలను పూర్తిగా పరిశీలించి, మ్యాప్ ద్వారా ఇప్పటి వరకు జరిగిన నిర్మాణం, పెండింగ్ అంశాలపై అధికారులు, స్థానిక పెద్దలతో చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆడిటోరియం అభివృద్ధిపై ప్రభుత్వం నుండి వచ్చిన రిమార్క్స్‌ని క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. ఆడిటోరియం ప్రాంగణానికి చెందిన స్థలాన్ని సమగ్రంగా సర్వే చేసి, ఆక్రమణలకు గురైనట్లు నిర్ధారణ జరిగితే నోటీసులు ఇవ్వాలని సిటీప్లానర్‌ని ఆదేశించారు.పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ రమేష్ బాబు, ఏఈ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

258వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి : తమకు రావలసిన బకాయిల కోసం ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి 258వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలలో షైక్ఇమాంబి, వై రమాదేవి, భూలక్ష్మి, తదితరులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఈ ప్రాంతానికి వచ్చి ఇచ్చిన హామీ మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో దామవరపు నాగేశ్వరావు, వైసాంబశివ రావు, తుపాకులనాగేశ్వరావు, బి సూర్యప్రకాష్, ఎం శివకుమారి, డినాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 5 అర్జీలు

ప్రజాశక్తి-తెనాలి రూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఐదు అర్జీలు స్వీకరించినట్లు తెనాలి తహసిల్దార్ కెవి గోపాలకష్ణ తెలిపారు. సర్వేపై-1, విద్యుత్ బిల్లు సమస్య-1, నష్టపరిహారం చెల్లింపుపై రైతు సంఘాల నేతలు ఫిర్యాదు-1, తల్లికి వందనం జమ కాలేదంటూ-1, గుడివాడ గ్రామంలో రైతుల సమస్యలపై ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కౌల్దార్ల చలో కలెక్టరేట్‌పై ప్రచారం

ప్రజాశక్తి -రొంపిచర్ల

కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద 25న నిర్వహించే ధర్నాలో కౌల్దార్లంతా పాల్గొనాలని కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రమైన రొంపిచర్లలో సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా అర్హులైన కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని, ఈ-క్రాప్‌లో కౌల్దార్ల పేర్లు నమోదు చేయాలని కోరారు. పంట రుణాలు, రాయితీపై వ్యవసాయ పనిముట్లతోపాటు అన్నదాత సుఖీభవ పథకాన్ని సైతం కౌలురైతులకు వర్తింపజేయాలని కోరారు. వ్యవసాయంలో అత్యధిక భాగాన్ని సాగు చేస్తున్న వాస్తవ సాగుదార్లయిన కౌలురైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని, ఉచిత పంటల బీమా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు, నాయకులు బి.బాలకోటయ్య పాల్గొన్నారు.



వినుకొండ ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

ప్రజాశక్తి - వినుకొండ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత - సాంస్కృతిక కమిషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ (ఐఐపిసి), ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా (పిఎఐ) వారు ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటో ఎగ్జిబిషన్‌లో 'ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డు 2025'ను, ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఫొటోగ్రఫీ కాంపిటీషన్లో పట్టణ వాసులు అవార్డులు సాధించారు. వినుకొండ ఫొటోగ్రాఫర్ వంగపల్లి బ్రహ్మయ్య, కేసనపల్లి సుబ్బారావు వీటిని అందుకున్నారు. విజయవాడలోని బాగలోత్సవ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, పాయ్ వైస్ ప్రసిడెంట్ డాక్టర్ కొంపల్లి సుందర్, ఫొటోగ్రఫీ అకాడమీ అఫ్ ఇండియా వ్యవస్థాపక ఛైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, సీఈఓ ఆర్.మల్లికార్జునరావు అవార్డులను ప్రదానం అందచేశారు. అవార్డు గ్రహీతలకు పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థుల హోం వర్క్‌ను వార్డెన్లూ పరిశీలించాలి : కలెక్టర్


విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- రెంటచింతల

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. మండల కేంద్రమైన రెంటచింతలలోని వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో వ్యక్తిగతంగా మాట్లాడి సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగారు. గణితం, ఇంగ్లీషు, సోషల్ తదితర సబ్జెక్టుల్లో విద్యార్థులను మెరుగుపరచాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల హోం వర్కులు హాస్టల్ వార్డెన్లు తప్పని సరిగా పరిశీలించేలా చూడాలన్నారు. పాఠ్యాంశాలను సరళమైన భాషలో బోధించాలన్నారు. ఈ సందర్భంగా గతేడాది పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన పాఠశాల విద్యార్థి నాదెండ్ల అమర్‌కు దాతలు బహుకరించిన రూ.2016ను కలెక్టర్ అందజేశారు. పాఠశాల అవసరాలపై కరస్పాండెంట్ వెంకట సైదయ్య వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

గాంధీ శంకుస్థాపన చేసిన పాఠశాల

ఇదలా ఉండగా పాఠశాల ప్రత్యేకతపై కలెక్టర్ మాట్లాడుతూ మహాత్ముడు నడయాడిన ప్రదేశంలో, ఆయన శంకుస్థాపన ద్వారా నిర్మాణమైన ఈ పాఠశాలను సందర్శించటం తనకు కొత్త అనుభూతి కలిగిందన్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ పాఠశాలకు మరింత పేరుప్రతిష్టలు వచ్చేలా చదువుపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ఘన చరిత్ర ఉన్న వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలను మరోసారి తప్పకుండా సందర్శించి విద్యార్థుల అభ్యాస స్థాయిలను పరీక్షిస్తానన్నారు. 1929, ఏప్రిల్ 21న మహాత్మా గాంధీ, లాలా లజపతి రాయ్ పేరు మీదుగా ప్రాథమిక పాఠశాలకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. 1960లో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన సమయంలో పాఠశాల నిర్మాణానికి ఆర్థిక సాయం చేసిన రంగనాయకులు శ్రేష్టి పేరు మీదుగా వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలగా మారిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, తహశీల్దార్ మేరీ కనకం, ఎంపీడీవో సిహెచ్.శ్రీనివాసరావు ఎంఈఓ శివనాగేశ్వరరావు, హెచ్ఎం కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో పురోగతి లేకుంటే చర్యలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సలో ప్రజల నుండి 141 అర్జీలను కలెక్టర్, ఇతర అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, సమస్య పూర్వాపరాలను తెలుసుకొని సంతృప్తికర రీతిలో పరిష్కారం చూపాలని సూచించారు. రీ ఓపెన్ అవుతున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆశాజనక ఫలితాలు రాని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబందిత శాఖకు పంపాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్, జిల్లా రెవెన్యూ అధికారి మురళి పాల్గొన్నారు.



పతకాలు సాధించిన షికోకాయ్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు

కరాటే పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థుల సత్తా

జాతీయ స్థాయి పోటీల్లో 22 మందికి పతకాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణానికి చెందిన షికోకాయ్ షిటోరియో కరాటే స్కూల్‌కు చెందిన 22 మంది విద్యార్థినీ విద్యార్థులు ఆలిండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు ఇండోర్ స్టేడియంలో గత ఆదివారం జరిగిన పోటీల్లో బాలికల కటా విభాగంలో డి.బాల వైష్ణవి (బ్రాంజ్ మెడల్), ఎస్.శరణ్య (బ్రాంజ్), ఎం.దేవిశ్రీ (బ్రాంజ్), ఎంవిన్ చైతన్య (బ్రాంజ్), ఎన్.జ్నాహావి (గోల్డ్), పి.పూజిత (సిల్వర్), పి.పావని ప్రియ (సిల్వర్), ఎస్.లావణ్య (సిల్వర్), డి.ఇందుశ్రీ (బ్రాంజ్) పతకాలు సాధించారు. బాలుర కటా విభాగంలో ఎస్.దినేష్ (గోల్డ్), బి.రఘునాథ్ (గోల్డ్), ఎం.బాలజీ (గోల్డ్), టి.నితీష్ నాయుడు (గోల్డ్), డి.తన్వీర్ (గోల్డ్), ఆదిత్య వర్ధన్ (గోల్డ్), ఆర్.సిదార్థ (గోల్డ్), షేక్ హసిమ్ (బ్రాంజ్), బి.ప్రణవ్ (బ్రాంజ్), ఎస్.నిషాంత్ (సిల్వర్), ఎస్.బిందుమాదవ్ (సిల్వర్), టి.నాని (బ్రోంజ్), బి.చందు (బ్రాంజ్) పతకాలు సాధించారు. వీరిని ఆలిండియా కరాటే అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మిల్టన్ శాస్త్రీ, ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ నల్లూరి మోహనరావు, షిహాన్, అనుముల రాంబాబు, కోచ్ అనుముల రామయ్య అభినందించారు.


పంపిణీకి సిద్ధంగా యూరియా

ప్రజాశక్తి - క్రోసూరు : స్థానిక వ్యవసాయ సహకారి సొసైటీలో యూరియాను అందుబాటులో ఉంచామని అధ్యక్షుడు కడియం శివనాగేశ్వరరావు సోమవారం తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, భూమి పట్టా పాస్ పుస్తకాలను తెచ్చుకుంటే ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేస్తామన్నారు. క్రోసూరు సొసైటీకి 20 టన్నుల యూరియా, 20 టన్నుల డిఎపి, 20 టన్నుల 20-20 మందు కట్టలు వచ్చాయని, రెండెకరాల కంటే ఎక్కువ పొలం ఉన్న రైతులకు స్టాక్ ఆధారంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. క్రోసూరు మార్కెట్ యార్డ్‌లో 20 టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశామన్నారు.

ప్రాణాపాయం జరగకముందే మార్చండి

ప్రజాశక్తి - మాచర్ల : ప్రాణాపాయం జరగకముందే దెబ్బతిన్న పోల్‌ను మార్చాలని తహశీల్దార్ బి.కిరణ్‌కుమార్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానిక గౌడ కాలనీ వాసులు సోమవారం విన్నవించారు. కాలనీలో కూల్ డ్రింక్స్ గౌడన్ ప్రాంతంలోని విద్యుత్ పోల్ కూలే దశకు వచ్చిందని, ఈ పోల్ తక్కువ ఎత్తు ఉండటంతో హైట్ లోడ్ వాహనాల వల్ల ఇప్పటికి అనేక మార్లు వైర్లు తెగి పడ్డాయని వివరించారు. విద్యుత్ వైర్లును హైట్ లోడ్ వాహనాలకు తగలనంత ఎత్తుకు సర్దుబాటు చేసేలా పోల్స్ వేయించాలని కోరారు. దీంతో తహశీల్దార్ స్పందించి సమస్య పరిష్కారం కోసం విద్యుత్ సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎం.శ్రీనివాసరావు, బి.లక్ష్మీనారాయణ, టి.సాంబశివరావు, చెన్నకేశవరావు, సురేంద్రబాబు, రామబ్రహ్మాచారి, శివశంకర్, నవీన్‌కుమార్, భీమేశ్వరరావు ఉన్నారు.


సుబాబుల్ తోట


సరుగుడు తోట

నష్టాల భయంతో ప్రత్యామ్నాయ బాట

ప్రజాశక్తి -రొంపిచర్ల

వ్యవసాయంలో నష్టాలను తప్పించుకోవడానికి రైతులు బహుముఖ రూపాల్లో ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా మండలంలో కొందరు రైతులు సుబాబుల్, సరుగుడు, జామాయిల్ సాగుపై దృష్టి పెట్టారు. సుమారు 500 ఎకరాల్లో ఇవి సాగవుతున్నాయి. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో సాగుకు నాణ్యత పరంగా మంచిపేరుంది. మూడేళ్లకు పంట చేతికొచ్చినా పెట్టుబడులు తక్కువగా ఉండడం, దిగుబడులూ ఆశాజనకంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు ఈ చెట్ల సాగుకు ఆసక్తిగా ఉన్నారు. ఈ ప్రాంతనుండి నిత్యం వందల సంఖ్యలో మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పేపరు మిల్లులకు సరుకు రవాణా అవుతోంది. వందలమంది కూలీలకు ఉపాధి పొందుతున్నారు. అయితే ఉద్యాన శాఖ నుండి సరైన ప్రోత్సాహాలు అందడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.10 వేలు సాయం చేయాలి

తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలో రైతు, కౌలు రైతు, వ్యవసాయకార్మిక సంఘాలు డిమాండ్ - అధికారులకు వినతి పత్రాలు




మంగళగిరి తాహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి - మంగళగిరి


భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు అన్నారు. సోమవారం మంగళగిరి తహశీల్దార్ కార్యాలయం వద్ద కౌలు రైతు రైతు, వ్యకాస సంఘం ఆధ్వర్యంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి రామారావు మాట్లాడుతూ 70 శాతం వ్యవసాయం కౌలు రైతులే సాగు చేస్తున్నారని, అన్నదాత సుఖీభవ పథకాన్ని వారికి కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన నష్టపోయిన వరి పంట రైతులకు ఎకరానికి రూ.పదివేల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి నియోజకవర్గం, పెదకాకాని, తదితర ప్రాంతాల్లో జిల్లా వ్యాప్తంగా 70 వేల ఎకరాలు వరి పంట రైతులు భారీ వర్షాల వలన నష్టపోయారని అన్నారు. మూడుసార్లు వరి పైరు వేయాల్సి వచ్చిందని, ప్రభుత్వం వెంటనే ఆదుకోవడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొండవీటి వాగు, గుంటూరు ఛానల్ కు భారీ వర్షాల వలన గండ్లు పడ్డాయని , కాలువ గట్టులకు పటిష్టంగా మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు సంవత్సరంలో 200 రోజులు కల్పించి రూ.200 వేతనమివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బి పేరిరెడ్డి, సిహెచ్ రామాంజనేయులు,వ్యకాస జిల్లా నాయకురాలు బి కోటేశ్వరి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిఐటియు నాయకులు యు దుర్గారావు, వివి జవహర్లాల్, జేవీ రాఘవులు, ఎస్ ఎస్ చెంగయ్య, ఎం బాలాజీ పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు .ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమనీ అప్పారావు మాట్లాడుతూ లంక భూములు ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు అకాల నష్టం జరిగిందని రెండుసార్లు విత్తనాలు వేసినప్పటికీ కుళ్ళి పోయాయని ఎకరాకు పదివేల రూపాయలు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. 11 వారాలుగా రావలసిన ఉపాధి హామీ కూలీలకు మూడు వారాలు డబ్బులు మాత్రమే వచ్చాయని వెంటనే మిగిలిన మొత్తం చెల్లించాలన్నారు తుమ్మపూడి గ్రామంలో ఇళ్ల స్థలాలకు పట్టాలని పెదకొండూరు లంక భూముల్లో సాగు చేస్తున్న సాగుదారులకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని లేని పక్షంలో రాబోయే కాలంలో ఉద్యమిస్తామని తెలిపారు. అనంతరం స్థానిక తహసిల్దార్ ఐ సునీతకు అర్జీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు జెట్టి బాలరాజు మన్నవ నాగమల్లేశ్వరరావు భీమవరపు అమ్మిరెడ్డి అద్దంకి పాములు యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావు ఎన్ యోగేశ్వరరావు వెంకాయమ్మ ఫకీరమ్మ మరియమ్మ మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాలలో వినతి


ప్రజాశక్తి తెనాలి : ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలువురు రైతులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ గతేడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రైతులు అధిక వర్షాలు, వరదల కారణంగా నష్టపోయారన్నారు. రైతులు, కౌలు రైతులు రెండు మూడు పర్యాయములు వెదబెట్టి ఎకరానికి రూ. 15వేల వరకూ పెట్టుబడి పెట్టి నష్టపోయారని తెలిపారు. కొలకలూరు, హాఫ్ పేట, నేలపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులు పొలాల వద్ద నిల్వ చేసుకున్న ఎరువులు కూడా వర్షానికి తడిసి అదనంగా నష్టపోయినట్లు చెప్పారు. తక్షణమే పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంత కాకుండా 80 శాతం గా ఉన్న కౌలు రైతులకు, దేవాలయ భూములు సాగు చేసుకుంటున్న వారికి ప్రభుత్వ హామీ మేరకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, అన్నదాత సుఖీభవ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వరదల వలన తెగిపోయి గండ్లు పడిన పంట కాలువలు మరమ్మత్తులు పూర్తిస్థాయిలో చేయాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ సకాలంలో వర్షాలు లేక సాగునీటి కోసం రైతులు నానా అవస్థలు పడ్డారని, ప్రస్తుతం కురిసిన అధిక వర్షాలకు అన్నదాతలు అవస్థలు రెట్టింపు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ, సిఐటియు డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి, రైతులు తమ్మ శివరాం, రవికిషోర్, కళ్ళం శ్రీనివాసరెడ్డి, కే రవి, గుంపెన రత్తయ్య, కప్పల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తెనాలి, ఫిరంగిపురంలో

ప్రజాశక్తి -మేడికొండూరు

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలకు నష్టపరిహారాన్ని రైతులకు వెంటనే అందివ్వాలని మేడికొండూరు తహశీల్దార్ జి రాఘవ రావుకు జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు బొట్ల రామకృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొట్ల రామకష్ణ మాట్లాడుతూ మేడికొండూరు మండల కేంద్రంలో అధిక వర్షాల వలన ఎక్కువగా పత్తి సాగు చేసిన పొలంలో పత్తి విత్తనములు మునిగిపోవుట వలన పొలంలో వర్షపు నీరు నిల్వ ఉండటం తోటి వేసిన పంట నీళ్లలో ఉరకెత్తి తీవ్రంగా నష్టం వాటిల్లిందని, పలు గ్రామాల మీదుగా కొండవీటి వాగు ఉధృతంగా పొంగిపొర్లడంతో పొలాల వెంబడి గండ్లు పడి, భూమి కోతకు గురైన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. కొండవీటి వాగు, నాగార్జునసాగర్ బ్రాంచ్ కెనాల్ మైనర్ కాలవలు వెంటనే యుద్ధ ప్రాతిపదిగిన మరమ్మతులు చేయాలని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మస్తాన్వలి, జానీ, ఘన్ సైదా, సుభాని తదితరులు పాల్గొన్నారు.



మేడికొండూరులో

ప్రజాశక్తి - పెదనందిపాడు

రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పెదనందిపాడు తాహిశీల్దార్ సిద్దెల హేనప్రియకు, కాకుమాను తాహిశీల్దార్ బి.వెంకట స్వామికి రైతు, కౌలు రైతు సంఘం మండల నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలు,వచ్చిన వరదలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, ప్రత్తి, వరి పంట వేసిన రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారని అన్నారు. గుంటూరు ఛానల్, కొండవీటి వాగు, ఇతర కాలువల పూడికలు తీసి బాగు చేయాలని కోరారు. అనంతరం పెదనందిపాడు, వరగాని, నాగులపాడు గ్రామాలలోని సచివాలయ అధికారులకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమం లో కౌలు రైతు క్సంఘం మండల నాయకులు నల్లమోతు రాజేంద్ర, రైతు సంఘం మండల అధ్యక్షులు ముద్దన వెంకటేశ్వర్లు, నాయకులు జంపని రామారావు, కాపు వెంకట సుబ్బారావు, మర్రి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పెదనందిపాడులో

ప్రజాశక్తి - తాడికొండ: గత వారంలో కురిసిన భారీ వర్షాలకు రైతులకు తీవ్రంగా పంట నష్టం జరిగిందని రైతు సంఘం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు అన్నారు.సోమవారం తహసిల్దార్ మెహర్ కుమార్ కు వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట రెండవ సారి వేసిన అధిక వర్షాలకు మునిగిపోయిందని.పత్తి, కూరగాయలు తదితర పంటలు పూర్తిగా మునిగిపోయాయని ఆయన అన్నారు. కావున వెంటనే ప్రభుత్వం రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. యజమానితో సంతబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి పంట రుణాలను మంజూరు చేయాలని అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు వర్తింప చేయాలని, ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచి ఉపాధి కల్పించాలని,కొండవీటి వాగు గుంటూరు ఛానల్ పంట కాలువలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరుతూ వినతి పత్రం అందించారు కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఇమ్మడి రామారావు, నాగిరెడ్డి,బాణావత్ భద్రయ్య,జోజి,వెంకటేశ్వర్లు, షాజహాన్ రైతులు పాల్గొన్నారు.

తాడికొండలో



ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని అధిక వర్షాల వల్ల నష్టపోయిన పత్తి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో పని లేకుండా కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపచేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పనుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ రైతు, కౌలురైతు, వ్యకాస సంఘాల నాయకులు ఫిరంగిపురం తహశీల్దార్ ప్రసాద్ రావు గారికి అర్జీ ఇవ్వటం జరిగింది కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల నాయకులు వై నాగేశ్వరరావు, కే కోటేశ్వరరావు, అంకమ్మరావు, సిఐటియు నాయకులు షేక్ మస్తాన్వలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎవిఎన్.కుమారి

21న మండలాల్లో అంగన్‌వాడీల నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడిల సమస్యల పరిష్కారానికి ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) పిలుపు మేరకు ఆగస్టు 21న దేశవ్యాప్త నిరసనలో భాగంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అంగన్వాడీలు, హెల్పర్లు నల్ల చీరలతో నిరసన తెలపాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవియన్ కుమారి పిలుపునిచ్చారు. సోమవారం పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో జి .రమణ అధ్యక్షతన యూనియన్ సమావేశం నిర్వహించారు. ఏవిఏన్ కుమారి మాట్లాడుతూ అంగన్వాడీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లో అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని, తల్లికి వందనం, వీడో పెన్షన్, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఇతర సంక్షేమ పథకాలన్నీ అంగన్‌వాడీలకు అమలు చేయాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షురాలు జి.రమణ మాట్లాడుతూ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి జీవో ఇవ్వాలని, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలని, గ్రాట్యుటీ, మట్టి ఖర్చుల జీవో మార్పు చేసి అమలు చేయాలని, గతంలో ఇచ్చిన టి .ఎ, డి .ఎ బిల్లుల జీవోని అమలు చేయాలని, ఎఫ్ ఆర్ఎస్‌ను రద్దు చేస్తూ జీవో ఇవ్వాలని, యూనియన్ నాయకులతో చర్చలు జరపాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, సామాజిక పెన్షన్ల బాధ్యత నుండి అంగన్వాడీలను మినహాయించాలని, హెల్పర్లకు వర్కర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అక్రమంగా సస్పెన్షన్‌కు గురైన లాం గ్రామం అంగన్వాడీ వర్కర్ టి. సామ్రాజ్యంకు సస్పెన్షన్ కాలం నాటి జీతాన్ని చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకై జరిగే నిరసన కార్యక్రమాలలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నల్ల చీరలు ధరించి, మానవహారాలు నిర్వహించాలని, ఎంఆర్ఒలకు వినతిపత్రాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ, అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకులు రత్న మంజుల, చిన్న వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ గోపాలకృష్ణకు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

దేవరపల్లి అగ్రహారపు పొలాల సమస్యపై సిపిఎం వినతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మురుగునీటి కాల్వల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతులతో కలిసి తహశీల్దార్ గోపాకృష్ణ ను కలిశారు. కొలకలూరు రైల్వే లైన్ కు అనుకుని దక్షిణ మధ్య రైల్వే చేపట్టిన మూడవ రైల్వే లైన్ నిర్మాణం కారణంగా మురుగు కాల్వల తూములు ఊడిపోయి పంటపొలాల్లోకి మురుగునీరు ప్రవేసించినట్లు తహశీల్దార్‌కు రైతులు విన్నవించారు. ఈ కారణంగా 125 ఎకరాల అగ్రహారపు పంట పొలాలు మురుగు నీటి సమస్యతో ఇబ్బందులకు గురౌతున్నాయని సిపిఎం జిల్లా నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ చెప్పారు. వెంటనే రైల్వే శాఖతో సంప్రదింపులు జరిపి గుడివాడ గ్రామంలో అగ్రహారపు రైతుల సమస్యలు పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి, సిపిఎం నాయకులు హుస్సేన్ వలి, రైతులు టి శివరాం, జి రత్తయ్య, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, గగరీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి : ఎస్పీ

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్పి కంచి శ్రీనివాసరావు అధికాలకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 86 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నాదెండ్ల మండలం గిరిజవోలు గ్రామానికి చెందిన షేక్.రబ్బాని, వినుకొండ పట్టణానికి చెందిన షేక్ ఖాజా మొహిద్దిన్, నరసరావుపేట కు చెందిన షేక్ మస్తాన్ భాష అను ముగ్గురు ఐ టి జాబ్ కొరకు జబ్బర్ అనే వ్యక్తి ద్వారా పరిచయమైన కాసరగడ్డ నరేంద్ర అను అతనికి ఐటి ఉద్యోగం కొరకు 4,00,000/- రూపాయలు ఇవ్వగా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆరు నెలలైనా ఉద్యోగం ఇప్పించకుండ డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ డబ్బులు అడుగుతుంటే



ఫిర్యాది దారులతో మాట్లాడుతున్న ఎస్పీ

బెదిరిస్తునన్నాడని విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని పిర్యాదు చేసారు. క్రోసూరు మండలం గరికపాడు గ్రామానికి చెందిన గార్లపాటి అనురాధ అను ఆమెకు పెళ్లి అయిన ఒక సంవత్సరానికి భర్త చనిపోయిగా ఆమెకు బంధువు బృగుబండ గ్రామానికి చెందిన సంగు. శ్రీనివాసరావు వివాహం చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేసి వివాహం చేసుకోకుండా ఆమెను అడ్డుపెట్టుకొని తెలిసిన వారి వద్ద రెండు లక్షల రూపాయలు తీసుకొని మోసం చేశాడని న్యాయం చేయాలని అనురాధ ఫిర్యాదు చేసింది. నరసరావుపేట యోగయ్య నగర్‌కు చెందిన డ్వాక్రా సురక్ష మహిళ పొదుపు గ్రూపు సెకండ్ లీడర్ అయిన సుజాత లోన్ డబ్బులు కట్టకుండా తన సొంత ప్రయోజనాలకు వాడుకోగా విషయం తెలిసిన గ్రూప్ సభ్యులు సుజాతను నిలదీయగా గ్రూపు సభ్యుల మీద కర్రలతో దాడి చేసినందని తమకు న్యాయం చేయాలని గ్రూప్ సభ్యులు పిర్యాదు చేసారు. కార్యక్రమం లో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, క్రైమ్ అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, మహిళా పోలీస్ స్టేషన్ డి.ఎస్పి ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపు, సంక్షేమ పథకాల అమలుపై సిఎస్‌తో చర్చించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



మాచర్ల బుజ్జి

ప్రభుత్వ సంస్థలు, పథకాలు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసే వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పని చేస్తున్న సిబ్బందికి కేవలం 13 వేలు వేతనం చెల్లిస్తున్నారని అయినప్పటికీ సంక్షేమ పథకాలు వర్తించకపోవడం బాధాకరమన్నారు. రోజు రోజుకి పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెరగక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఔట్సోర్సింగ్ కార్పొరేషన్ కొనసాగే విధంగా తీర్మానం చేయాలని మంత్రులు కమిటీని కోరారు.



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి బాలాజీ గంగాధర్

ఎరువుల కృత్రిమ కొరత సృష్టించొద్దు

వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్

ప్రజాశక్తి - వెల్దుర్తి

ఎరువుల కృత్రిమ కొరతలు సృష్టించవద్దని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ అన్నారు. సోమవారం మండలంలోని ఎరువుల షాపులను పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడారు. ఎరువుల షాపుల యజమానులు రైతు వద్ద ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధర తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రైతులు ఎరువులు తీసుకునేటప్పుడు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు అనంతరం షాపు యజమానుల వద్ద బిల్లు పుస్తకాలను, ఎరువుల నిల్వలను, తనిఖీ చేశారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎండిఓ ప్రసాద్ రావు తహశీల్దార్ రాజశేఖర్ నాయక్ తదితరులు ఉన్నారు

సాఫ్ట్ బాల్ వైస్ ప్రెసిడెంట్‌గా మత్తే కుమార్

ప్రజాశక్తి - మాచర్ల

ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా మాచర్ల సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం వ్యాయామ ఉపాధ్యాయుడు మత్తే కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక కార్యక్రమం గుంటూరు, పల్నాడు జిల్లా డిఎస్డివో పి నరసింహారెడ్డి , శ్రీకాకుళం జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ రమణ బాబు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ బాల్ కోఆర్డినేషన్ సెక్రెటరీ పి. నరసింహ రెడ్డి, జిల్లా సాఫ్ట్ బాల్ సెక్రెటరీ పి. సామంత రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన వ్యాయామ ఉపాధ్యాయుడు మత్తే కుమార్‌కు సెయింట్ ఆన్స ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు సంతోష్, ప్రతాప్, ప్రకాష్, వినేష్, వెంకట్, సబిత, శ్రీను, అనూష, వర్షిని పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్ నందు సమగ్ర శిక్ష వారి సాహితీ విద్య విభాగం వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవస రాలు గల పిల్లలకు ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వ హించారు. నియోజకవర్గంలోని అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ, పెదకూరపాడు మండలాల్లోని దివ్యాం గుల విద్యార్థులకు వైద్య చేశారు. వ్యాధి నిర్ధారణ అనంతరం వీల్ చైర్స్ వాకింగ్ స్టిక్స్ శ్రావణ పరికరాలు అందించనున్నారు జిల్లా ఐఈడి కోఆర్డినేటర్ సెల్వ రాజు, మరియు మండల విద్యాధికారి ఏకుల ప్రసాదరావు, మండల టిడిపి అధ్యక్షులు వై.బ్రహ్మయ్య, హైస్కూలు హెచ్ఎం కె.వి రమణ, మాజీ మండల అధ్యక్షులు గళ్ళా బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో సిబ్బంది భాగస్వామ్యం తప్పనిసరి



మాట్లాడతున్న ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రకృతి వ్యవసాయంలో సిబ్బంది భాగస్వామ్యం తప్పనిసరి అని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ అమల కుమారి అన్నారు. పెదకూరపాడు, సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాల వీఏఏలు, వీహెచ్ఏలు, సిబ్బందికి సోమవారం ప్రకృతి వ్యవసాయ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అమల కుమారి మాట్లాడుతూ రసాయనాలు అధిక వాడకంతో భూసారం తగ్గిపోతోందిని దీని వల్ల రైతులు నష్టపోతున్నారని. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ రామచంద్రపురం, సత్తెనపల్లి డివిజన్ ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి పద్ధతుల్లో పంటలు పండించడంవలన. రైతులకు ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందని విరించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ఏవో సుబ్బారెడ్డి, ముప్పాళ్ల ఏవో శ్రీధర్ రెడ్డి, పెద్దకూరపాడు ఏవో కృష్ణయ్య, జిల్లా ట్రైనర్స్ సైదయ్య, నందకుమార్, అప్పలరాజు, సత్తెనపల్లి డివిజన్ ఎంసీ మధుబాబు, యూనిట్ ఇన్‌చార్జిలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిపై ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామాన్ని, గ్రామ ప్రజలను అడ్డుపెట్టుకొని మోసం చేసి డబ్బు సంపాదించుకునే అవకాశం ఇవ్వలేదన్న అక్కస్సుతో వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిపై పాదయాత్ర వెంకటేశ్వరరెడ్డి ఆరోపణలు చేస్తున్నాడని రంగారెడ్డిపాలెం గ్రామ వైసిపి నాయకులు ఆరోపించారు. ఆయనపై ఆరోపణలు అవాస్తవమన్నారు. కళ్యాణ మండపం కట్టిన భూమి బిసిలకు చెందింది కాదని పెద్దల నుండి వారసత్వంగా సంక్రమించిందని స్థలదాత దొండేటి అచ్చిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు శుభకార్యాలు చేసుకోవడానికి ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో కళ్యాణ మండపం నిర్మాణానికి 30 సెంట్ల స్థలాన్ని వితరణ చేశానని నిర్మాణానికి రూ 70 లక్షల విరాళాలు గ్రామస్తులు శక్తి మేరకు అందజేశారన్నారు.



మాట్లాడుతున్న రంగారెడ్డిపాలెం గ్రామస్తులు

గ్రామ పెద్దలు అభ్యర్థించగా స్పందించిన డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇనుము, సిమెంటు, ఇసుక, గ్రానైట్ విరాళంగా అందజేశారన్నారు. ఇంకా 20 శాతం పనులు పెండింగ్ లో ఉంటే రూ 3 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని, అద్దె వసూలు చేస్తున్నారని చెప్పడం డాక్టర్ గోపిరెడ్డికి ఆపాదిం చడం వెంకటేశ్వర రెడ్డికి తగదన్నారు. మాజీ సర్పంచ్ దొండేటి అప్పిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

కొట్టుకున్న వైసీపీ వర్గీయులు.. గంగిరెడ్డిపాలెంలో బయటపడ్డ విభేదాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆదివారం చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి విడదల రజినితో పని చేయలేమని వ్యతిరేక వర్గం బహిరంగంగా వ్యాఖ్యానించిన ఘటనపై చర్చ జరుగుతుండగానే నరసరావుపేట నియోజకవర్గ వైసిపిలో విభేదాలు బయటపడ్డాయి. నరసరావుపేట మండలం రంగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త పాదయాత్ర వెంకటేశ్వరరెడ్డిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. అయితే డాక్టర్ గోపిరెడ్డి అనుచరులే తనపై దాడికి పాల్పడ్డారని



గాయపడిన వెంకటేశ్వరరెడ్డి

వెంకటేశ్వరరెడ్డి ఆరోపిస్తున్నారు. వైసిపి హయాంలో గ్రామానికి రోడ్డు మార్గం వేయలేకపోయారని, నాడు నేడు కింద స్కూల్ అభివృద్ధి చేయలేదని ఇటువంటి అక్రమాలను సోషల్ మీడియాలో ప్రశ్నించడాన్ని ఓర్వలేని గోపిరెడ్డి అనుచరులు దాడికి పాల్పడ్డారన్నారు. దాడి అనంతరం గ్రామానికి వచ్చిన డాక్టర్ గోపిరెడ్డి తన అనుచరులను ఇంకా రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడారని ఆరోపించారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి నుండి వారి అనుచరుల నుండి ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

ప్రభుత్వ హామీలకు పూర్తిస్థాయిలో కార్యరూపం : ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - మాచర్ల

కూటమి ప్రభుత్వ మంత్రులు ఇచ్చిన హామీలన్నీ పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చుతున్నాయని ప్రభుత్వ హామీల కమిటి సభ్యులు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. సోమవారం ఏపీ అసెంబ్లీ కమిటీ సమావేశ మందిరంలో ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, శాసన సభలో మంత్రులు అభివృద్ధి పనులపై ప్రజలకు ఇచ్చిన హామీలు, చేసిన వాగ్ధానాలపై తయారు చేసిన ప్రణాళికలపై చర్చిచడం జరిగిందని ఆయన వెల్లడించారు. అభివఅద్ధే ధ్యేయంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతఅత్వంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ఇచ్చిన ప్రతి హామీ అమలు అవుతోందిని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇచ్చిన హామీల్లో దాదాపు 90 శాతం పైగా అమలయ్యాయని వివరించారు. అలానే ప్రాంతాల అభివఅద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, మౌళిక వసతులు, మానవనరుల కల్పనలో సింహభాగం నిధులు ఖర్చు చేస్తోందని ఆయన చెప్పారు.

సొసైటీ చైర్మన్‌గా వెంకటసుబ్బారావు

ప్రజాశక్తి - యడ్లపాడు



వెంకటసుబ్బారావు

యడ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) త్రిసభ్య కమిటీ చైర్ పర్సన్‌గా మద్దినేని వెంకటసుబ్బారావు, సభ్యులుగా మిరియాల నాగేశ్వరరావు, యనగందుల వీరాంజనేయులు నియమితులయ్యారు. స్థానిక సొసైటీలో మద్దినేని వెంకటసుబ్బా రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సొసైటీ సెక్రటరీ శ్రీనివాసరావు, సిబ్బంది. తెదేపా నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

హౌసింగ్ ఏఈ మరియదాసుకు సన్మానం

ప్రజాశక్తి - మాచర్ల

ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా మాచర్ల మండలం ఉత్తమ హౌసింగ్ ఏఈగా అవార్డు అందుకున్న సాతులూరి మరియాదాసును వేముల దుర్గ ప్రసాద్, హౌసింగ్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక హౌసింగ్ ఏఈ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిఈ బాలాజీ నాయక్, ఏఈ మరియదాసును శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏఈ మరియదాసు మాట్లాడుతూ డిఈ బాలాజీ నాయక్, హౌసింగ్ సిబ్బంది కృషి, ప్రోత్సహం వల్లనే తనకు ఈ అవార్డు సాధ్యమైనదన్నారు. ఈ కార్యక్రమం లో వర్క్ ఇన్స్‌పెక్టర్లు కిన్నెర తేజ, ఎం. మహేంద్ర కుమార్, అలీ, ఎలీసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల పురపాలక సంఘ పరిధిలో మంగళవారం నుండి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ డి. వేణుబాబు సోమవారం తెలిపారు. 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మాచర్ల పురపాలక సంఘం, పూర్ణయ్య సెడ్ బజార్, సెరీన్ కాలనీ సచివాలయముల నందు ఆధార్ క్యాం పులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కమిషనర్ డి.వేణుబాబు కోరారు.

జడ్పీ పాఠశాలకు జిరాక్స్ మిషన్ అందజేత

ప్రజాశక్తి - వినుకొండ

రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణం లోని ఎస్ఎస్పీ కాలనీలో గల జడ్పీహెచ్ స్కూల్ నందు రోటరీ సభ్యులు గాండ్ల నాగేంద్రుడి సహకారంతో జిరాక్స్ మిషన్‌ను ప్రింటర్ సౌకర్యార్థం ఈరోజు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వీరప్పయ్య అధ్యక్షతన కార్యక్రమం జరిగింది రోటరీ క్లబ్ అధ్యక్షులు వై.వి. నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేని పాఠశాలలకు మా రోటరీ క్లబ్ ద్వారా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయటం జరుగుతుంది అని ఆయన అన్నారు. రిటైర్డ్ మాస్టర్ ను పలువురు అభినందించారు ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వైవి నారాయణ సెక్రెటరీ ఎస్.కె బాజీ మాజీ అధ్యక్షులు గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి జిల్లా క్యాబినెట్ సభ్యులు చిరుమామిళ్ల కోటేశ్వరరావు ఆలా శ్రీనివాసరావు మాజీ సెక్రెటరీ గుత్తా గురునాథం క్లబ్ డైరెక్టర్ కూచి రామాంజనేయులు ఎన్.పద్మజ, పిఈటి రాధాకృష్ణమూర్తి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వడ్డేశ్వరంలో శ్మశాన వాటికలను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

ఎనిమిది శ్మశాన వాటికలు ప్రారంభం


ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వడ్డేశ్వరం గ్రామంలో ఎనిమిది శ్మశాన వాటికలను టిడిపి గ్రామ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన రావు, మంగళగిరి నియోజకవర్గ, తాడేపల్లి మండల నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం మంత్రి నారా లోకేష్ వివిధ అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. వడ్డేశ్వరంలో మూడు కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో హిందూ, ముస్లిం, క్రైస్తవ స్మశాన వాటికలను, ప్రహరీ గోడలు, విశ్రాంతి గదులతో, మౌలిక వసతులు కల్పించి నిర్మించినట్లు తెలిపారు. టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు వేమూరి మైనర్ బాబు, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు బి.కృష్ణవందన, టిడిపి గ్రామ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, టిడిపి గ్రామ కార్యదర్శి మద్దినేని సుబ్రమణ్యం, తెలుగు యువత మండల నాయకులు ఎస్.కె.ఖాశింబాబు, షేక్ ఇమాంసా, ఎండి ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

థియేటర్లో నిద్రపోయిన బాలుడు సకాలంలో స్పందించిన పోలీసులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

13 సంవత్సరాల బాలుడు తమ బంధువులతో కలిసి రెండో ఆట సినిమా కెళ్ళి హాలులో నిద్రపోయిన సంఘటన కలకలం రేపింది. సినిమా మధ్యలో బయటకు వెళ్లి వచ్చిన బాలుడు తర్వాత నిద్రపోయాడు. బంధువులు గమనించకుండా ఇంటికి వెళ్లిపోయాడని భావించారు. సినిమా ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లన బంధువులు ఇంటిదగ్గర బాలుడు లేకపోవడంతో చుట్టూ ప్రక్కల వెతికి సినిమా హాలుకు వెళ్లారు. అక్కడ ఉన్న సిబ్బంది నుండి ఎటువంటి స్పందన లేదు. రాత్రి రెండు గంటల సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి విషయం తెలిపారు. స్టేషన్ ఇన్‌చార్జి ఎం.కోటేశ్వరావు, బీట్ కానిస్టేబుల్ రాజేష్ బంధువులతో కలిసి థియేటర్‌కు వెళ్లి హెచ్చరించడంతో అరగంట తర్వాత థియేటర్ తెరిచి చూడగా బాలుడు కుర్చీలో ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. దీనితో కుటుంబ సభ్యులు పోలీసు సిబ్బందిని అభినందించారు.



మాట్లాడుతున్న బ్రహ్మయ్య

సహకార సంఘ అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - పెదకాకాని

సహకార సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని ఛైర్మన్ జాలాది బ్రహ్మయ్య అన్నారు. తక్కెళ్ళపాడు గ్రామ వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా జాలాది బ్రహ్మయ్య, సొసైటీ పర్సన్స్‌గా అలపర్తి సదాశివరావు, మైల ఏడుకొండలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. సీఈవో నిమ్మగడ్డ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన ఛైర్మన్ బ్రహ్మయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కూచిపూడి రత్నకుమారి, చిగురుపాటి పద్మజారాణి, కర్నాటి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు ఆలపాటి సంపత్, మాకిరెడ్డి జయరామిరెడ్డి, డిసిసి ఛైర్మన్ బూసి బాబు, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మహమ్మద్ మోసిన్ బ్యాంక్ అధికారులు, రైతులు చర్చలు పాల్గొన్నారు.

నేడు, రేపు సిఎం మంగళగిరి పర్యటన

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు మంగళ, బుధవారాల్లో మంగళగిరిలో పర్యటించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ సోమవారం పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు ముఖ్యమంత్రి కార్యక్రమాలకో ఆర్డినేటర్, శాసనమండలి సభ్యులు పెందుర్తి వెంకటేశ్వరరావు, ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ ప్లానింగ్ శాఖ అనంత శంకర రావు, ఎండి, సీఈఓ ఏపీటీఎస్, ఏపీఐఎస్ ఎ.సూర్య తేజ, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా సిఎంఓ కార్యాలయ అధికారి ఇక్బాల్ సాహెబ్ పాల్గొన్నారు. తొలుత మంగళవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జరిగే జీరో ప్రావర్టీ పీ4 కార్యక్రమంలో పాల్గొనే ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించి సీటింగ్ ఏర్పాట్లు, సభాస్థలి ఏర్పాట్లు, పీఏ సిస్టమ్ ఏర్పాట్లు , మీడియా గ్యాలరీ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఈ నెల 20వ తేది మంగళగిరి పట్టణంలోని మయూరి టెక్ పార్క్ లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు అందజేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో యంటీయంసీ కమిషనర్ అలీం బాషా, ఆర్ డి ఓ కె.శ్రీనివాస రావు, సిపిఓ శేషశ్రీ, డిఎస్ఓ చంద్రముని, పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మీ, డీడీ ఎస్ఐసీ బిమల్‌కుమార్, డీటీసీ కె.సీతారామిరెడ్డి, గ్రామ / వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ మోహన్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి కృష్ణారెడ్డి, డీఎస్పీలు మురళి కృష్ణ, రవి కుమార్, మంగళగిరి తహశీల్దార్ కె.దినేష్ రాఘవేంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఆదర్శనీయులు విద్యాదాత గాదే రామయ్య



మాట్లాడుతున్న గాదే కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - తాడేపల్లి

విద్యతోటే సమాజం అభివృద్ధి అవుతుందని భావించిన విద్యాదాత గాదే రామయ్య అందరికీ ఆదర్శనీయమని పలువురు వక్తలు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం ఉండవల్లి లోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన గాదే రామయ్య సీతారావమ్మ విగ్రహాలను వారి కుమారుడు సోమశేఖర రావు, కుమార్తె చాముండేశ్వరి దేవి, గాదే భావన్నారాయణ ఆవిష్కరించారు. తాను పుట్టిన ఊరుకోసం ఏదైనా మేలు చేయాలన్న ఉద్దేశ్యంతో ఉండవల్లి గ్రామంలో పాఠశాల నిర్మాణంకోసం సుమారు 10 కోట్ల రూపాయల విలువైన భూమిని దానం ఇవ్వటం తోపాటు తన సొంత నిధులతో పాఠశాల భవన నిర్మాణం చేపట్టిన విద్యాదాత గాదే రామయ్య అని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. గాదే రామయ్య స్ఫూర్తితో మరింత మంది దాతలు రాష్ట్రంలోని పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని హైస్కూల్ ఉపాధ్యాయులు సరోజని, ఆంజనేయులు, భారతీరాజా కోరారు. కాగా పాఠశాల భవన నిర్మాణంలో విశిష్ట సేవలందించిన శ్రీరామచంద్రమూర్తి (జై ఆంధ్రా మాష్టారు) ని స్మరించుకుంటూ వారి పిల్లలు భానుమతి, జనార్ధన్, విక్రమ్‌ను గాదెవారి కుటుంబ సభ్యులు సత్కరించారు.

నూతన కార్యవర్గానికి సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఛైర్మన్ గా టిడిపి సీనియర్ నాయకులు గాదే పిచ్చిరెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్లుగా జనసేన పార్టీ నాయకులు వాసా వేణు కుమార్, బిజెపి నాయకులు అందే శివశంకరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సీనియర్ నాయకులు తిరుమలశెట్టి కొండలరావు వారిని ఘనంగా సన్మానించారు. రైతన్నల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.



ప్రమాణం స్వీకారం చేసిన గాదే, డైరెక్టర్లు

సొసైటీ ఛైర్మన్ ప్రమాణస్వీకారాన్ని అడ్డుకున్న టిడిపి నాయకులు



కార్యాలయం వద్ద వేచి ఉన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని బండారుపల్లి కో-అపరేటివ్ సొసైటీ ఛైర్మన్ పదవిపై తెలుగుదేశం పార్టీలో తీవ్ర కలకలం రేపుతోంది. బండారుపల్లి గ్రామానికి చెందిన గుంటుపల్లి పానయ్యను సొసైటీ ఛైర్మన్‌గా నియమించారు. పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గ్రామంలో ఉన్న టీడీపీలోని ఒక వర్గం సోమవారం ప్రమాణ స్వీకారం జరగాల్సి ఉండగా ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఛైర్మన్ పదవి కేటాయింపుపై బండారుపల్లి సొసైటీ వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు. 2023 వరకు అసలు పార్టీ సభ్యత్వమే లేని వ్యక్తికి సొసైటీ పదవి అప్పగించారంటు ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూదన్ రావు విలేకరులతో మాట్లాడుతూ ఇది పార్టీ అంతర్గత విషయమని ఎమ్మెల్యేతో చర్చించి సామరస్యంగా సమస్యను పరిష్కారం చేసుకుంటామని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది : గాదె

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలు, పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామంలో అకాల వర్షాల వలన దెబ్బతిన్న పంట పొలాలను ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు సోమవారం పరిశీలించారు. సందర్భంగా రైతులు పంట నష్టం గురించి వివరించారు. ఇప్పటికే రెండుసార్లు వరి నాట్లేసి నష్టపోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారని తెలిపారు. రైతుల నుంచి సమస్యలు తెలుసుకున్న అనంతరం గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చట్టాల త్రినాథ్, మేకల రామయ్య, మండల అధ్యక్షులు చందు శ్రీరాములు, పొన్నూరు మండల అధ్యక్షులు నాగి శెట్టి సుబ్బారావు, పొన్నూరు పట్టణ అధ్యక్షులు కరిముల్లా, అధికార ప్రతినిధి శ్రీధర్, చేబ్రోలు గ్రామ అధ్యక్షులు సుజిత్ రైతులు పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న గాదె వెంకటేశ్వరరావు

కమిషనర్ పిజిఆర్ఎస్‌కు తొమ్మిది అర్జీలు


ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 9 అర్జీలు దాఖలైనట్లు కమిషనర్ వి.లక్ష్మీపతిరావు వెల్లడించారు. ఇంజనీరింగ్ సెక్షన్‌కు సంబంధించి మురుగునీటి కాలువలు నిర్మించాలని, తాగునీరు రాకపోయినా బిల్లు వసూలు చేస్తున్న కారణంగా మంచినీటి కలెక్షన్ తొలగించాలని, సకాలంలో తాగునీరు రావడంలేదని తదితర ఫిర్యాదులు అందాయన్నారు. అర్జీలను సంబంధిత అధికారులకు తగు చర్యల నిమిత్తం పంపనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ఓ రాంప్రసాద్, మేనేజర్ విల్సన్ జయకర్, ఏసిపి వాణి, ఎంఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతులు వేదన పట్టించుకోని ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పొన్నూరు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు పంట నష్టపోయి విలవిలలాడుతూ ఉంటే స్థానిక ఎమ్మెల్యే ధూళిపాల నరేంద్ర కుమార్ ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారంటూ పొన్నూరు నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ దుయ్యబట్టారు. మండల పరిధిలోని ముంపుకు గురైన పలు గ్రామాలలోని వరి పొలాలను సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గోళ్ళమూడి, నంబూరు, సెలపాడు, వెల్లలూరు పొలాలలో నారుందా? నీరు ఉందా? నువ్వు దిగి చెప్పగలవా నరేంద్ర...? అంటూ ప్రశ్నించారు. రైతులకు మేలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన హితవు పలికారు.



స్ఫూర్తి సేవా సంస్థ కార్యదర్శి రవికి చెక్కు అందిస్తున్న వెంకటపాలెం మాజీ సర్పంచ్ చేకుర్తి రవిబాబు

స్ఫూర్తి సేవా సంస్థకు నగదు వితరణ

ప్రజాశక్తి - తుళ్లూరు

స్ఫూర్తి సేవా సంస్థ నిర్వహిస్తున్న ప్రజాహిత కార్యక్రమాలకు ప్రోత్సాహం అందించాలన్న సంకల్పంతో వెంకటపాలెం మాజీ సర్పంచ్ చేకూర్తి రవిబాబు ఆ సంస్థకు 25,000 రూపాయలు సాయం అందించారు. సోమవారం స్ఫూర్తి సేవా సంస్థ సెక్రటరీ టి.రవికి 25 వేల చెక్కును అంద జేశారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



మహిళను ఆశ్రమానికి తరలిస్తున్న తహశీల్దార్, పోలీసులు

మానవత్వాన్ని చాటిన తహశీల్దార్

ప్రజాశక్తి - తెనాలి

మతిస్థిమితం లేని మహిళను తహశీల్దార్ కె.వి. గోపాలకృష్ణ చొరవ తో సోమవారం గుంటూ రు మదర్ థెరిస్సా అనాధ శరణాలయానికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలో ఓ మహిళ దాదాపు నెల రోజులుగా సంచరిస్తుందని, ఎవరైనా ఆహారం అందించినా తీసుకోవడం లేదని తెలుసుకున్న తహశీల్దార్ సోమవారం ఆమెతో మాట్లాడారు. ఆమె పేరు పావని అని, మారీసుపేటకు చెందిన మహిళగా గుర్తించారు. ఆమెను జెఎంజె ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వధార్ హోంకు తరలించారు. అక్కడ వారు పోలీసుల సహకారంతో గుంటూరు నిర్మల హృదయ భవన్ మదర్ థెరిస్సా అనాధ ఆశ్రమానికి తరలించినట్లు వెల్లడించారు.



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ కె.సుబ్బారావు

కిట్స్‌లో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో 2025-2025 విద్యాసంవత్సరం బి.టెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు సోమవారం తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా కళాశాలలో నూతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే కాకుండా ఉపాధి అవకాశాలు సాధించటానికి అవసరమైన తర్ఫీదును తమ నిపుణులైన అధ్యాపకులతో అందిస్తామని చెప్పారు. తమ విద్యార్థులు బహుళజాతి కంపెనీల ప్రాంగణ ఎంపికలలో మంచి ఉపాధి అవకాశాలు సాధిస్తున్నారన్నారు.విద్యార్థుల్లోని సజనాత్మకతను వెలికితీయడానికి వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సాంకేతిక సబ్జెక్టుకు సంబంధించి కాలేజీలో ఉన్న క్లబ్బులను పరిశీలించి అవసరమున్న వాటిలో చొరవగా భాగస్వాములు కావాలన్నారు. వాటిలో చేరడం ద్వారా కోడింగ్, ఇన్నొవేషన్ బందాలతో కలిసి పాల్గొనవచ్చన్నారు. సిఎస్ఐ క్లబ్స్, ఐఈఈఈ, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ క్లబ్‌లు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసిలో చేరటం ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను రెట్టింపు అవుతాయని, నిష్ణాతులతో చర్చించడానికి ఉపయోగపడతాయన్నారు. ఇప్పటివరకు 25కి పైగా స్టార్టప్‌లు స్థాపించబడ్డాయని, 210కి పైగా పేటెంట్లు ప్రచురించబడ్డాయని, 410 విద్యార్థుల ప్రాజెక్టులు అభివద్ధి అయ్యాయన్నారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులు ఉత్తమ క్రమశిక్షణతో విద్యానభ్యసిస్తున్నారని, ఆధునిక పోకడలతో విద్యను అలక్ష్యం చేయకుండా విద్యార్థులు మెలిగేలా తాము కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు ప్రసంగించారు.

వాటర్ వర్క్స్ కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గుంటూరు నగరపాలక సంస్థలోని వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు రెయిన్‌కోట్‌లు, గ్లౌజులు, మాస్కులు వంటి రక్షణ పరికరాలు అందచేయాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ముత్యాలరావు, నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు కోరారు. సోమవారం యూనియన్ నాయకులు గ్రీవెన్స్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు అర్జీ అందజేశారు. ప్రస్తుతం అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హెడ్ వాటర్‌వర్క్స్‌లో, నగరంలోని వివిధ రిజర్వాయర్లలో పని చేస్తున్న వాటర్‌వర్క్స్ కార్మికులు నిరంతరాయంగా నగర ప్రజలకు మంచినీటి నీటగి సరఫరా చేసేందుకు ఈరక్షణ పరికరాలు ఉపకరిస్తాయని, కావున కార్మికులు అందించాలని కోరారు. అలాగే ఇటీవల మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపుదలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవోను అమలు చేయాలని కోరారు. కమిషనర్ పులి శ్రీనివాసులు స్పందిస్తూ పెరిగిన జీతాల జీవో అమలుకు అధికారులను ఆదేశించామని, అలాగే కార్మికుల రక్షణ పరికరాలు అందజేసేందుకు వెంటనే ఫైల్ పెట్టాలని అధికారులకు ఆదేశించారు.

దుగ్గిరాల ఎస్‌టిఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతినెలా జీతాల బిల్లులు పెండింగ్‌లో ఉంచి ఉపాధ్యా యులు, ఉద్యోగుల్ని వేధింపులకు గురి చేస్తున్న దుగ్గిరాల ఎస్‌టిఒ అశ్వినిపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ కోరారు. సోమవారం జిల్లా ట్రెజరీ అధికారి చంద్ర శేఖర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందచేశారు. ఎస్‌టిఒ అశ్విని ప్రతి బిల్లునూ ఏదో ఒక కొర్రీ వేసి రెండు, మూడుసార్లు వెనక్కి పంపిస్తున్నారని, అవసరంలేని జిఒలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతుంటే దుగ్గిరాల ఎస్‌టిఒ పరిధిలోని దుగ్గిరాల, కొల్లిపర మండలాల ఉపాధ్యాయుల బిల్లులు పాస్ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అదేమిటని అడిగితే నేను మంత్రి తాలూకా..నన్నేమీ చేయలేరని బెదిరింపులకు దిగుతున్నారని అన్నారు. పదేళ్ల క్రితం హెచ్ఆర్ఎ మారి జీతాలు తీసుకుంటూ ఉన్న గ్రామాలలో ఖాళీలు కోరుకొని వచ్చిన ఉపాధ్యాయుల్ని ఇప్పుడు మళ్లీ జీఒలు తెచ్చి ఇవ్వాలని, జీతం చెల్లించకుండా తిప్పుతున్నారన్నారు. కావున జిల్లా అధికారులు జోక్యం చేసుకొని జీతాల చెల్లింపునకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డిటిఒను కలిసిన వారిలో జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, ఎం.గోవిందు, జి.వెంకటేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, బి.ప్రసాద్, ఎం.కోటిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రెహమాన్, చంద్రశేఖర్, శివపూర్ణయ్య, ధనరాజు, భాస్కర్ తదితరులున్నారు.


డిటిఒను కలిసిన యుటిఎఫ్ నాయకులు

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 198 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు



జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, డిపిఒ సాయికుమార్, డ్వామా పీడీ శంకర్ ప్రజల నుండి 198 అర్జీలు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి..



గత కొన్ని రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా పెదకాకాని మండలంలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. గుంటూరు ఛానల్ వెంట ఉన్న నంబూరు, పెదకాకాని, గోళ్లమూడి, వెంకటకృష్ణాపురం, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో సుమారు 11వేల ఎకరాల విస్తీర్ణంలో పంటలు నీటిమునిగాయని చెప్పారు. గుంటూరు ఛానల్‌కు అక్కడక్కడా గండ్లు పడటంతో వరదనీరు అధికంగా వచ్చి ఇప్పటికీ పొలాల్లో నీరు నిలిచి ఉందన్నారు. మొక్క దశలో ఉన్న వరి పంట మొత్త దెబ్బతినిపోయిందన్నారు. ఇప్పటికే రైతులు రెండుసార్లు విత్తనాలు చల్లి ఎకరాకు రూ.20వేల వరకూ పెట్టుబడి పెట్టామన్నారు. కావున నష్టాన్ని అంచనా వేసి, పరిహారం ఇవ్వాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో డి.నాగేశ్వరరావు, ఎం.మల్లిఖార్జునరావు, ఎస్.వి.రామారావు ఉన్నారు.

పొగాకు మొతాన్ని కొనుగోలు చేయాలి



ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభం అయినందున వారు పంటలు వేసుకోవటానికి పెట్టుబడి సమకూరాలంటే రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని ప్రత్తిపాడు మండలం, తిమ్మాపురం సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఆయన రైతులతో కలిసి గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో రైతులు పండించిన నల్లబర్లీ పొగాకును పెదకాకాని, గుంటూరు, కాకుమానులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటిదాకా 50 వాతమే కొనుగోలు చేశారని, మిగిలిన పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. పొగాకు అమ్మిన రైతులకు ఇప్పటిదాకా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని కోరారు. నాణ్యత తక్కువగా ఉన్న పొగాకును కనీసం రూ.6వేలకు అయినా కొనాలని కోరారు. రైతుల వద్ద ఉన్న పొగాకు కొనుగోలు చేయకపోతే ఎకరానికి లక్ష నష్టం వస్తుందన్నారు కావున ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో ఎంపిటిసి పి.సాంబశివరావు, రైతులు కె.రామారావు, కె.సాల్‌బాబు, కె.ఆనంద్‌బాబు, వై.డేవిడ్, కె.మార్పు తదితరులున్నారు.

గిరిజన కమ్యూనిటీ హాళ్లను వ్యక్తిగతంగా వినియోగించుకుంటున్నారు..



గిరిజన ప్రజల కోసం కేటాయించిన కమ్యూనిటీ హాళ్లను ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా గిరిజన భవన్ సంక్షేమ కమిటీ నాయకులు కోరారు. తెనాలి, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్థానిక గిరిజన ప్రజల అవసరాలకు కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించి, భవనాలు మంజూరు చేశారన్నారు. అయితే ఆ భవనాలను కొందరు గిరిజన ఉద్యోగులు సంఘాలు ఏర్పాటు చేసుకొని వాటిని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అద్దెలకు ఇస్తూ ఆదాయ వివరాలు ప్రభుత్వానికి లెక్క చెప్పట్లేదన్నారు. తెనాలి చెంచుపేటలో, గుంటూరులోని ఆలా హాస్పిటల్ వద్ద ఉన్న యానాది కాలనీలో, శ్యామలా నగర్‌లోని బంజారా కాలనీలో ఉన్న కమ్యూనిటీ హాల్స్‌ను కొందరు ఉద్యోగులు వారి ఆధీనంలో ఉంచుకొని అద్దెలు వసూలు చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. కావున వారిపై సమగ్ర విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ గిరిజన సంఘాల నాయకులు ఎం.శివానాయక్, కుందనాటి సంజయ్‌బాబు, టి.ఉమామహేశ్వరరావు, కె.సూరిబాబు, ఆర్.గోపి, పి.అశోక్ ఉన్నారు.

విట్ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలోని విట్ కళాశాల హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం యూనివర్సిటీ సిఎస్ ఓ ప్రకాష్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు అర్జీ అందజేశారు. యూనివర్సిటీ మెస్‌లో నాణ్యతలేని, కలుషితమైన ఆహారం పెడుతుండటం వల్ల అనారోగ్యాల పాలు అవుతున్నా మంటూ విద్యార్థులు ఆందోళన చేసిన నేపథ్యంలో విట్ యాజమాన్యానికి, తుళ్లూరు తహసీల్దారుకు ఎస్ఎఫ్ఐ నాయకులు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా అధ్యక్షులు సమీర్ మాట్లాడుతూ యూనివర్సిటీ మెస్‌లో విద్యార్థులకు అపరిశుభ్రమైన, కలుషితమైన ఆహారం పెట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యతలేని ఆహారం పెట్టడం పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రికి, యూని వర్సిటీ రిజిస్ట్రార్‌కు విద్యార్థులు లేఖలు రాశారని, వీటి పై ప్రభుత్వం, యూనివర్సిటీ యాజమాన్యం స్పందించి తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు. రాజధానిలోని యూనివర్సిటీలలో రాజధాని గ్రామాల విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు యశ్వంత్ పాల్గొన్నారు.




విట్ యూనివర్సిటీ సిఎస్ఓకి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బిసిలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బిసిలకు 50శాతం రిజర్వేషన్ విద్యా, ఉద్యోగ, రాజకీయ, స్థానిక సంస్థల లో అమలు చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూరపాటి సుబ్బారావు కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. బిసిలకు తమ తమ వాటా ప్రకారం జనాభా నిష్పత్తిన కేటాయించి వారికి రిజర్వేషన్ అమలు పరచాలని సుబ్బారావు డిమాండ్ చేశారు. బహుజన రాజ్యాధికార దిశ గా పయనించవలసిన ఆవశ్యాకత ఎంతైనా ఉందని, బీసీలు మేల్కొని హక్కులు అమలు కు కషి చేయాలన్నారు. బిసిలకు సిఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. 50 ఏళ్లు నిండిన బిసిలకు ఫించన్లు ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వరగాని ఏడుకొండలు , జిల్లా ఇంచార్జి జి.మాణికుమారి, బి ఎస్ పి నాయకులు శంగార పాటి బాబురావు, చీరతానగండ్ల వాసు సునీల్ దళిత ప్రజా సంఘాల నాయకులు భాగతసింగ్, జూపూడి శ్రీనివాసరావు తన్నీరు సాంబయ్య, డేవిడ్ విలియమ్స్, ఎస్ వి సత్యనారాయణ,మతయ్య, ప్రకాష్, బహుజన సమాజ్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న బిఎస్‌పి నాయకులు